క్లుప్తంగా

ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్‌కు ఆహ్వానం


ఆహ్వానపత్రిక అందజేస్తున్న దాత రమేష్

అర్వపల్లి : కొమ్మాల గ్రామంలో ఈ నెల 27 నుంచి 2రోజులపాటు జరిగే అభయాంజనేయ స్వామి ఆలయ మహాకుంభాభిషేక మహోత్సవానికి హాజరుకావాలని రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్‌కు బుధవారం ఆలయ నిర్మాణ దాత గోళ్ల రమేష్–మమత దంపతులు ఆహ్వానపత్రికను అందజేశారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


నియామకపత్రాలు అందిస్తున్న సంకినేని

దురాజ్‌పల్లి : సూర్యాపేట నియోజకవర్గంలో భారతీయ జనతా పార్టీ బలోపేతానికి నాయకులు కృషి చేయాలని పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పట్టణ సంస్థాగత పదవులను ప్రకటించారు. పట్టణ ప్రధాన కార్యదర్శులుగా ఆరూరి శివ, తొనుకునూరి సంతోష్ కుమార్, బీజేవైఎం పట్టణ అధ్యక్షుడిగా దోసకాయల ఫణి నాయుడు, మైనార్టీ మోర్చా పట్టణ అధ్యక్షులుగా షేక్ సలీం పాష, కిసాన్ మోర్చా పట్టణ అధ్యక్షులుగా దుబ్బాక వెంకటరెడ్డిలను నియమించారు. అనంతరం వారికి నియామక పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఎండీ అబీద్, జిల్లా నాయకులు తుక్కాని మన్మథరెడ్డి, పలస మల్సూర్‌గౌడ్, పగిళ్ల సునీందర్‌రెడ్డి, సంధ్యాల సైదులు, వెన్న శశిధర్‌రెడ్డి, జోగం శ్రీనివాస్ పాల్గొన్నారు.

విగ్రహాల ప్రతిష్ఠాపన


తిరుమలగిరిలో విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న భక్తులు

తిరుమలగిరి : శ్రీ సీతారాముల నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గురువారం తిరుమలగిరి మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం, యాదవ సంఘం ఆధ్వర్యంలో విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్థికసాయం అందజేత


భిక్షపతి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న పేర్ల గణేష్

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన కొండేటి భిక్షపతి కుమార్తె అనారోగ్య సమస్యతో బాధపడుతూ మృతి చెందింది. దీంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న భిక్షపతి కుటుంబానికి బుధవారం గ్రామానికి చెందిన పేర్ల గణేష్ 25కేజీల బియ్యం, నిత్యావసర ఖర్చుల నిమిత్తం రూ. 2వేల ఆర్థికసాయం అందజేశారు.

వేణుగోపాలాచార్యులకు ఉగాది పురస్కారం


పురస్కారం అందుకుంటున్న వేణుగోపాలాచార్యులు

భానుపురి : జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థాన ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

మునగాల : ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో బుధవారం ఉగాది పర్వదినం సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ పట్టణానికి చెందిన నవ్వుల రారాజులు ఫేస్‌బుక్ సభ్యులు, గ్రూప్ అడ్మిన్ల సహకారంతో వృద్ధులు, మానసిక దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నర్సింహాపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ, బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు తుమ్మలపల్లి భాస్కర్‌రావు, కోదాడ మండలం ఖానాపురం సర్పంచ్ శ్రీనివాసరావు, పర్వతనేని ఉపేందర్, ఈవీఆర్ పాల్గొన్నారు.

ఘనంగా ఉగాది వేడుకలు


మంత్రికి ఉగాది శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్, అదనపు కలెక్టర్


కలెక్టర్, ఎస్పీ, అధికారులకు ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న మంత్రి


శుభాకాంక్షలు తెలుపుతున్న ఎస్పీ, తదితరులు


క్యాంపు కార్యాలయంలో పంచాంగం ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి


మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాప్రతినిధులు


తుంగతుర్తి : పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రజలు

సూర్యాపేట : సూర్యాపేట పట్టణ వ్యాప్తంగా శోభకృత్ నామ ఉగాది పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలంతా తెల్లవారుజాము నుంచే ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. షడ్రుచులతో ఉగాది పచ్చడిని తయారు చేసుకున్నారు. పట్టణంలోని పలు దేవాలయాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ఆలయ అర్చకులు, పురోహితులు పంచాంగ శ్రవణాన్ని భక్తులకు చదివి వినిపించారు. సూర్యాపేట జిల్లాకేంద్రంలోని స్థానిక క్యాంపు కార్యాలయంలో మంత్రి జగదీశ్‌రెడ్డిని జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ సంస్థలు, సంఘాల నాయకులు కలిసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. పలు పురోహిత సంఘాలు, ధార్మిక సంస్థల ఆధ్వర్యంలో రూపొందించిన ఉగాది పంచాంగ పుస్తకాలను మంత్రి జగదీశ్‌రెడ్డి ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

తుంగతుర్తి : మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉగాది పండుగను ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ వేడుకల్లో పూజారులు కాటూరి రామాచార్యులు, గ్రామస్తులు ఓరుగంటి సత్యనారాయణ, దయాకర్, సీతయ్య, గుండగాని రాములు, కేదారి, మల్లయ్య, వీరన్న, సోమన్న, ముత్యాల వెంకన్న, రాములు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ప్రజలు పాల్గొన్నారు.

సూర్యాపేట రూరల్ : గ్రామాల్లో శోభకృత నామ సంవత్సర ఉగాది వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం, వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్ నాయుడు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వంగాల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : మండల పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వేడుకల్లో ఎంపీపీ ధరావతు కుమారి బాబునాయక్, వైస్ ఎంపీపీ జూలకంటి జీవన్ రెడ్డి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల పరిధిలోని గ్రామాల్లో శోభకృత నామ సంవత్సర ఉగాది వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు.

ఆత్మకూర్ (ఎస్) : శ్రీశోభకృత్ నామ సంవత్సరం ఉగాది పర్వదినం సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో పంచాగ శ్రావణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నూగూరు వెంకటరంగాచార్యులు, శ్రీనివాసాచార్యులు, సోమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మర్ల చంద్రారెడ్డి, బొడ్డు వెంకన్న, చంద క్రిష్ణమూర్తి, లింగారెడ్డి, భిక్షంరెడ్డి, సోమయ్య, భిక్షం, మల్లయ్య, భద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం ఉగాది వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు జరిపారు. అలాగే పురోహితుడు మోత్కూరు రాజుశర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు.

యోగానందలక్ష్మీనర్సింహ ఆలయంలో..

ఉగాది సందర్భంగా బుధవారం జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. పురోహితుడు మోత్కూరి సోమయ్యశాస్త్రి పంచాంగ శ్రవణం గావించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన డైరెక్టర్ కోటమర్తి మల్లయ్య, కూర శంకర్, హరిప్రసాద్, జహంగీర్, పుల్లయ్య, వెంకన్న పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని గ్రామాల్లో శ్రీశోభకృత నామ సంవత్సర ఉగాది వేడుకలను ప్రజలు బుధవారం ఘనంగా నిర్వహించారు.

నాగారం : ఉగాది సందర్భంగా మండలంలోని నాగారం, మాచిరెడ్డిపల్లి, ఈటూరు, వర్ధమానుకోట, ఫణిగిరి తదితర గ్రామాల్లోని దేవాలయాల్లో బుధవారం పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు కాశీ వెంకటేశ్వర్లు, సర్పంచ్ పుసుపులేటి ప్రేమలతవెంకట్‌రెడ్డి, బోయిని శోభలింగమల్లు, గుట్టు నర్సింహారావు, నాయకులు లింగమల్లు, యాదగిరి, రాఘవరెడ్డి, పిచ్చిరెడ్డి, శ్రీను, పుల్లయ్య, భద్రయ్య, యాదగిరి, వెంకటభిక్షం, దశరథ, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

తిరుమలగిరి : ఉగాది పర్వదినాన్ని తిరుమలగిరి మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు భాస్కర శర్మ పంచాంగ శ్రవణం వినిపించారు.


నాగారంలో..


పెన్‌పహాడ్ : చీదెళ్లలో..


అర్వపల్లి ఆలయంలో..


తిరుమలగిరిలో..


ఆత్మకూరులో..


నూతనకల్ : మిర్యాలలో..


అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం దేవాలయంలో..


నాగారం : మాచిరెడ్డిపల్లిలో..

ప్రజాస్వామ్య పరిరక్షణకే జనచైతన్య యాత్ర

పెన్‌పహాడ్: మతోన్మాద బీజేపీ పాలనలో కనుమరుగవుతున్న ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం కోసమే జనచైతన్య యాత్ర సీపీఎం ఆధ్వర్యంలో జన చైతన్య యాత్ర నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు నెమ్మాది వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం భక్తాళాపురం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జన చైతన్య యాత్ర ఈ నెల 25, 26 తేదీల్లో కోదాడ నుంచి హుజూర్‌నగర్, నేరేడుచర్ల మీదుగా మిర్యాలగూడేనికి చేరుకుంటుందని అన్నారు. బీజేపీ ప్రజావ్యతిరేక పాలనకు నిరసనగా సీపీఎం చేస్తున్న పోరాటాలకు లౌకిక, ప్రజాతంత్ర శక్తులు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు అడివయ్య, పీరయ్య, గోపయ్య, రమేష్, చిరు, సంపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతమైన వాతావరణం కోసమే కార్డన్ సెర్చ్


కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్న డీఎస్పీ నాగభూషణం

సూర్యాపేట రూరల్ : గ్రామాల్లో ప్రశాంతమైన వాతావరణం ఏర్పాటు చేయడం కోసమే పోలీస్ కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నామని డీఎస్పీ నాగభూషణం అన్నారు. పట్టణ పరిధిలోని 13వ వార్డు గాంధీనగర్‌లో బుధవారం తెల్లవారుజామున పోలీస్ సిబ్బందితో కార్డన్ సెర్చ్ నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనం నడపాలన్నారు. గ్రామంలో సరైన కాగితాలు లేని 33ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్, సీఐలు సోమనారాయణసింగ్, రాజశేఖర్, ఎస్‌ఐలు సాయిరాం, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

తీన్మార్ మల్లన్నను అరెస్టు చేయడం హేయమైన చర్య

నాగారం : ప్రజా సమస్యలపై పోరాడే తీన్మార్ మల్లన్నను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం హేయమైన చర్యని బీజేవైఎం మండల నాయకుడు అనంతుల సోమేష్‌గౌడ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుక తీన్మార్ మల్లన్న అని అన్నారు. గత కొన్ని రోజులుగా ప్రజల, నిరుద్యోగుల, విద్యార్థుల పక్షాన పోరాడుతున్న తీన్మార్ మల్లన్న క్యూ న్యూస్ కార్యాలయంపై దాడి చేసి, అరెస్టు చేయడం తగదన్నారు. ఆయనతో పాటు బీజేవైఎం నాయకులు తదితరులు ఉన్నారు.

మృతుల కుటుంబాలకు మంత్రి పరామర్శ


పెన్‌పహాడ్ : చిలకయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి


చివ్వెంల : మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని మహ్మదాపురం గ్రామానికి చెందిన సర్పంచ్ కొండేటి రజిని మామ కొండేటి చిలకయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బుధవారం మృతుడి కుటుంబాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, మామిడి అంజయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, సర్పంచ్‌లు బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, నాగార్జున, గోపి, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చివ్వెంల : తిమ్మాపురం గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ మంజూరు బాబా తండ్రి ఖాదర్ బాబా (60) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. దీంతో అతడి మృతదేహాన్ని రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సందర్శించి, భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నంద్యాల జనార్దన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ రౌతు నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

కమీషన్ రాక రేషన్ డీలర్ల పాట్లు

- నాలుగు నెలలుగా అందని కమీషన్
- వెంటనే చెల్లించాలని డీలర్ల వినతి


వేల్పుచెర్ల గ్రామంలో లబ్ధిదారులకు రేషన్ బియ్యం పంపిణీ చేస్తున్న డీలర్

అర్వపల్లి : లబ్ధిదారులకు రేషన్ బియ్యం నెలనెలా సమయానికి తెచ్చి పంపిణీ చేస్తున్నప్పటికీ డీలర్లకు మాత్రం కమీషన్ సొమ్ము సక్రమంగా రాని పరిస్థితి నెలకొంది. నెలనెలా కమీషన్లు అందాల్సి ఉండగా ఏనాడూ సరిగా రావడం లేదు. దీంతో రేషన్ దుకాణాల నిర్వహణ, అద్దె, హమాలీ, ఇతర ఖర్చుల భారం డీలర్లపైనే పడుతుంది. అసలే అరకొర కమీషన్, ఆపై సకాలంలో చెల్లించకపోతే తమ పరిస్థితి ఏంటని డీలర్లు ప్రశ్నిస్తున్నారు. గతంలో ఒకనెల కమీషన్ మరోనెలలో వచ్చేదని.. కానీ గత నాలుగు నెలల కమీషన్ సొమ్ము పెండింగ్‌లో ఉండటంతో అప్పులు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

జాజిరెడ్డిగూడెం మండలంలో ఇలా..

జాజిరెడ్డిగూడెం మండలంలో 17 గ్రామపంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల్లో 8,934 తెల్లరేషన్ కార్డులు ఉండగా ప్రతి నెలా 418.685 మెట్రిక్ టన్నుల బియ్యం ప్రజలకు పంపిణీ చేస్తున్నారు. కాగా మండలంలో 16మంది రేషన్ డీలర్లు పనిచేస్తున్నారు. నవంబర్, డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి నాలుగు నెలలకు సంబంధించిన కమీషన్ డీలర్లకు రావాల్సి ఉంది. వీరికి ప్రభుత్వం కమీషన్ రూపేణ క్వింటాకు రూ.70చొప్పున చెల్లిస్తుంది. అయితే ఈ ఇచ్చే తక్కువ కమీషన్ కూడా నెలల తరబడి రావడం లేదని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంటి అద్దె, హమాలీ చార్జీలు, ఇంటర్నెట్ రీచార్జి, కరెంట్ బిల్‌తో సహా మొత్తంగా ప్రతినెలా రూ.5వేలకు పైగానే ఖర్చవుతుందని, ఈ భారం మోయడం ఇబ్బందిగా మారిందని చెబుతున్నారు. ఇప్పటికైనా బకాయి కమీషన్లను చెల్లించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నెలనెలా కమీషన్ చెల్లించాలి

రేషన్ డీలర్లకు నెలనెలా కమీషన్ చెల్లించాలి. నాలుగు నెలల కమీషన్ పెండింగ్‌లో ఉండటంతో దుకాణాలు నడపటం కష్టంగా మారింది. ఇప్పటి నుంచైనా వెంటవెంటనే చెల్లించాలి.


– మామిడి శ్రీను, డీలర్, అర్వపల్లి

ఇబ్బంది పడుతున్నాం

డీలర్లకు ఇచ్చే చాలీచాలని కమీషన్‌తో ఇబ్బంది పడుతున్నాం. నెలకు ఒక్కో షాప్ నిర్వహణకు రూ.5వేలకు పైగానే ఖర్చు వస్తుంది. డీలర్ల సమస్యలను పరిష్కరించి, కమీషన్ పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలి.


– దండ అరుణభద్రారెడ్డి, డీలర్ల సంఘం అధ్యక్షురాలు

'పది' విద్యార్థులకు తప్పని భారం

- నాగారంలో పరీక్ష కేంద్రం లేక ఇక్కట్లు


నాగారంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల

నాగారం : నూతనంగా ఏర్పడిన నాగారం మండలంలో పదవ తరగతి పరీక్ష కేంద్రం లేకపోవడంతో ఏటా విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. మండలంలో 6 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక మోడల్ స్కూల్, ఒక ప్రైవేటు స్కూల్ ఉన్నాయి. ఈ పాఠశాలల నుంచి ఈ ఏడాది 220 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాయనున్నారు. పది పరీక్ష రాసేందుకు విద్యార్థులు సుమారు 8 నుంచి 10 కి.మీ వెళ్లాల్సిందే. విద్యార్థులు పరీక్షలు రాసేందుకు రవాణా భారంతో పాటు సమయానికి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు.

మూడు మండలాల్లో పరీక్షలు..

నాగారం మండలం నుంచి పదవ తరగతి పరీక్ష రాసే విద్యార్థులు మూడు మండలాలకు వెళ్లి పరీక్షలు రాయనున్నారు. ఉమ్మడి మండలాల ప్రకారం పరీక్ష కేంద్రాలను నిర్వహిస్తుండటంతో మండలంలోని పసునూర్, పస్తాల, శాంతినగర్, లక్ష్మాపురం గ్రామాల విద్యార్థులు తుంగతుర్తిలో, నాగారం, నాగారంబంగ్లా, వర్ధమానుకోట, మాచిరెడ్డిపల్లి, డి.కొత్తపల్లి, పేరబోయినగూడెం, నర్సింహులగూడెం గ్రామాల విద్యార్థులు జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలో, ఫణిగిరి, ఈటూరు, మామిడిపల్లి గ్రామాల విద్యార్థులు తిరుమలగిరి మండల కేంద్రంలో పరీక్షలు రాయనున్నారు. దీంతో విద్యార్థులు సుమారు 8 నుంచి 10 కి.మీపైగా దూరం ప్రయాణించి పరీక్షలు రాయనున్నారు. మండలంలోని పలు గ్రామాలకు సరైన రవాణా సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. నాగారం మండల కేంద్రంలో 10 పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని ఏటా కోరుతున్నప్పటికీ మంజూరు కాకపోవడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. ఏటా విద్యార్థులు బస్సులు లేదా ఇతర ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి పరీక్షలకు వెళ్తున్నారు. దీంతో సకాలంలో పరీక్ష కేంద్రానికి చేరకపోవడంతో పాటు ప్రయాణంలో అలసిపోతున్నారు.

220 మంది విద్యార్థులు

నాగారం మండలం నుంచి ఈ ఏడాది 220 మంది విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు. మండలంలో పరీక్ష కేంద్రం లేకపోవడంతో విద్యార్థులు ఏటా తుంగతుర్తి, అర్వపల్లి, తిరుమలగిరి మండలాలకు వెళ్లి పరీక్షలు రాయడానికి ఇబ్బందులు పడుతున్నారు. నాగారం మండల కేంద్రంలో పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది.


– పల్స వెంకన్న, ప్రధానోపాధ్యాయుడు, నాగారం

పాఠశాలలకు ఫర్నిచర్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలో 11పాఠశాలలు మనఊరు–మనబడికి ఎంపికైన విషయం తెలిసిందే. అయితే ఈ పాఠశాలల్లో మరమ్మతులు, అదనపు గదుల నిర్మాణపు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఇదిలా ఉంటే ఆయా పాఠశాలలకు ఫర్నిచర్ కూడా చేరుతుంది. రెండు రోజులుగా మనఊరు–మనబడి పాఠశాలలకు డ్యుయల్ డెస్క్ టేబుల్స్, కుర్చీలు, బోర్డులు, ఇతర సామగ్రి చేరాయి. తొలుత జాజిరెడ్డిగూడెం, రామన్నగూడెం ప్రాథమిక పాఠశాలలకు కార్పొరేట్ పాఠశాలలకు దీటైన సామగ్రిని పంపించారు. అయితే ఆధునీకరణ పనులు వెంటనే పూర్తి చేసి ఈ రెండు పాఠశాలలను త్వరలో మోడల్‌గా ప్రారంభించనున్నారు. ఆ తర్వాత మిగలిన 9పాఠశాలలకు ఫర్నిచర్‌ను పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసి ప్రారంభించడం జరుగుతుందని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.


డీసీఎంలో అర్వపల్లి పాఠశాలకు వచ్చిన ఫర్నిచర్

హైవేపై వెలగని హైమాస్ట్‌లు

- మద్దిరాలలో అంధకారంగా మారుతున్న జాతీయ రహదారి


మద్దిరాలలో 365 జాతీయ రహదారి వెంట వెలుగని హైమాస్ట్ విద్యుత్ లైట్స్

మద్దిరాల : హైవేల వెంబడి హైమాస్ట్ లైట్లు వెలుగకుండా అలంకారప్రాయంగా దర్శనమిస్తున్నాయి. మద్దిరాల మండలం గుండా నాలుగు జిల్లాలను కలుపుకొని 365 జాతీయ రహదారి వెళ్తోంది. దీంతో ఈ మండంలో వాహనాల రద్దీ పెరిగింది. సూర్యాపేట–వరంగల్, సూర్యాపేట–మహబూబాబాద్, సూర్యాపేట–నల్లగొండ ప్రజలు ఈ 365 జాతీయ రహదారి గుండా నిత్యం ప్రయాణిస్తుంటారు. ఈ జాతీయ రహదారిపై ఎర్రపహాడ్ ఎక్స్‌రోడ్డు, మద్దిరాల మండల కేంద్రంలో హైమాస్ట్ లైట్లు అమర్చారు. కానీ వాటికి విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రి సమయంలో లైట్లు వెలుగకుండా నిరుపయోగంగా మారాయి. వెంటనే అధికారులు జాతీయ రహదారి వెంట ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను అందుబాటులోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు, ప్రయాణికులు కోరుతున్నారు.

రెండేళ్లు గడిచినా వెలగడంలేదు

జాతీయ రహదారి వెంట హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేసి రెండేళ్లు దాటింది. అయినా ఇంతవరకు వాటికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో అవి నిరుపయోగంగా మారాయి. ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే హైమాస్ట్ లైట్లను వినియోగంలోకి తీసుకురావాలి.


– మద్దెల భిక్షపతి, కుక్కడం

ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభం

మునగాల : కలకోవ గ్రామపంచాయతీ పరిధిలో గల శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయ పునర్నిర్మాణ పనులను బుధవారం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ ఆలయం పురాతనమైనది కావడంతో ఆలయ కమిటీ, గ్రామస్తుల సహకారంతో పునర్నిర్మాణ పనుల కోసం మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్‌ల సహకారంతో దేవాదాయ శాఖ నుంచి రూ.50లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చేపట్టబోయే పనుల్లో భాగంగా నిర్మాణ పనుల కోసం మట్టి నమూనా సేకరణ చేపట్టారు. కార్యక్రమాన్ని సర్పంచ్ కొంపెల్లి సుజాత ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జూకూరి గుర్వయ్య దంపతులు, ఎంపీటీసీ భవానీ పాల్గొన్నారు.